సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ၊ 12 ၊ మార్చి ၊ 2024



కేజీబీవీల్లో ప్రవేశాలు..

కేజీబీవీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు.

- 8లో



మళ్లీ రూట్ మారింది

వందేభారత్ రూట్ మళ్లీ మారింది. ఈ ప్రత్యేక రైలు భువనేశ్వర్ – విశాఖ మధ్య నడవనుంది.

- 8లో




అశేష భక్తజనం మధ్య చక్రతీర్థ స్నానం (ఇన్‌సెట్‌లో) నంది వాహనంపై ఉత్సవమూర్తులు

సుమనోహర క్రతువు

- వైభవంగా ముఖలింగేశ్వరుని త్రిశూల చక్రతీర్థ స్నానం
- భక్తజనంతో నిండిపోయిన వంశధార

తీరంలో సైకత లింగాలు ప్రాణం పోసుకున్నాయి. నదిలో నీటి బిందువులు గంగమ్మను ఆవాహన చేసుకున్నాయి. గర్భగుడి వదిలిన ముఖలింగేశ్వరుడు ఊరేగింపుగా ముందుకు కదలగా.. వెంట భక్తజన ప్రవాహం ఉపనదిలా సాగి వంశధారలో కలిసింది. భక్తుల గళము లన్నీ గరళకంఠుని కీర్తించగా.. స్వామి తనువును తాకిన జలము తీర్థమై విరాజిల్లింది. ఇసుక రేణువుల్లో అణువణువు ప్రమధ గణాలను ఆహ్వానించగా.. మధుకేశ్వరుని చక్రతీర్థ స్నాన క్రతువు పవిత్ర యాగంలా సాగింది.

జలుమూరు, ఎల్‌ఎన్ పేట:

శ్రీముఖలింగంలోని శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం త్రిశూల చక్రతీర్థ స్నానాలు వైభవంగా జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య స్వామి వారి చక్రతీర్థ స్నానాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుద్ధ పాడ్యమి ఘడియల అనంతరం 12 గంటలకు పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అర్చకులు పంచాది ప్రభాకర రావు వెంకటాచలం, రవి శంకర్ తదితరులు ఆలయ గర్భగుడి నుంచి బయటకు తీసుకువచ్చారు. స్వామికి ఎస్పీ జీఆర్ రాధిక మొదటి హారతినిచ్చి టెంకాయ కొట్టారు. అప్పటికే సిద్ధం చేసిన నంది వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి వంశధార ఒడ్డుకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అప్పటికే భక్తులు వేలాదిగా వంశధార చేరుకుని ఎదురుచూస్తున్నారు. సంప్రదాయం ప్రకారం మిరియాపల్లి రేవులో లుకలాపు కుటుంబీకులు స్వామికి చక్రతీర్థ స్నానాలు నిర్వహించి చేనేత వస్త్రాలు, యజ్ఞోపవీతం సమర్పించారు. క్రతువు ముగిసిన వెంటనే మళ్లీ స్వామిని గర్భగుడికి చేర్చారు.

ఫలించిన అధికారుల వ్యూహం

చక్రతీర్థ స్నానాల్లో భక్తులను అదుపు చేసేందుకు అధికారులు ప్రత్యేక వ్యూహం పాటించారు. నదికి రెండు వైపులా ఐరన్ డబుల్ బారికేడ్లు పెట్టడంతో రద్దీ తగ్గింది. స్వామి దర్శనం కూడా చక్కగా జరిగింది. ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యేక చొరవతో ప్రధాన ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు, రోప్ పార్టీ ఏర్పాటు చేశారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి భక్తులకు సులువుగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నారు.



చక్రతీర్థ స్నానాన్ని ఆచరిస్తున్న మహిళ

న్యూస్‌రీల్

భవిత కేంద్రాలకు ఫిజియో థెరపిస్టుల నియామకం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో రెండు క్లస్టర్స్ పరిధిలోని రెండు ఫిజియోథెరపిస్టు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. ఇంటర్మీడియెట్‌తోపాటు బీపీటీ/ఎంపీటీ పూర్తిచేసిన స్థానిక అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం క్లస్టర్ (ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి), పలాస క్లస్టర్ (పలాస, మందస, సోంపేట) ఈ రెండు చోట్ల ఫిజియోథెరపిస్టుల నియామకానికి స్టేట్ ప్రాజెక్ట్ అధికారులు అనుమతులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. అర్హతలకు సంబంధించిన వివరాలు, దరఖాస్తుల వివరాలకు శ్రీకాకుళం.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలని కోరారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 12,13 తేదీల్లో సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా కార్యాలయంలో సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని డాక్టర్ జయప్రకాష్ సూచించారు. మరిన్ని వివరాలకు 9492420186 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఆర్‌డీఏ పీడీగా బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారిగా పెద్దింటి కిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కలిశారు. ఈయన గతంలో మన్యం-పార్వతీపురం జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేశారు. వీరఘట్టం ఎంపీడీఓగానూ సేవలు అందించారు.

'జీడికి మద్దతు ధర ప్రకటించాలి'



జీడిరైతుల కష్టాలు వివరిస్తున్న లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, తదితరులు

కాశీబుగ్గ: ఉద్దానం ప్రాంతంలో పండే జీడిపంటకు మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించాలని, జీడి పిక్కలకు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బీకేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని జీడి రైతుల సంఘం ఆధ్వర్యంలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సోమవారం మహాధర్నా చేశారు. ధర్నాకు వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర నాయకులు చాపర సుందరలాల్, లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, సీపీఐ ఎంఎల్ నాయకురాలు పి.కుసుమ మాట్లాడుతూ జీడి రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పరుగు పందెం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళలు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పెద్దింటి ముకుంద రావు అన్నారు. ఎస్ఎం పురం ఆర్‌జీయూకేటీలో నెహ్రూయువకేంద్రం ఆధ్వర్యంలో నారీ శక్తి ఫిట్‌నెస్ రన్‌లో బాగంగా విద్యార్థినులకు 100 మీటర్ల పరుగు పందెం సోమవారం నిర్వహించారు. మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శారీరక వ్యాయామం ద్వారా పూర్తిస్థాయి ఆరోగ్యం, వ్యాధుల నియంత్రణ సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ జి.ఈశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ హరిచందన పాల్గొన్నారు.

పోషణ్ పఖ్వాడా పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోషన్ పఖ్వాడా పోస్టర్‌ను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నారు. అనంతరం బాల్యవివాహాల నివారణ పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, తదితరులు ఉన్నారు.

హస్తినలో ఎగిరిన సిక్కోలు కీర్తి పతాక

- నమో డ్రోన్ దీదీ కార్యక్రమానికి హాజరైన పోలాకి మండలం సుసరాం మహిళ
- ప్రధాని ముందు డ్రోన్ ఎగరవేసిన అరసవిల్లి గాయత్రి
- సాగులో డ్రోన్ల వినియోగంపై వైఎస్ జగన్ సర్కారు ప్రత్యేక శ్రద్ధ
- ఇప్పటికే రెండు సార్లు ఔత్సాహిక మహిళలకు శిక్షణ
- తర్ఫీదు పొందిన వారిలో 10మందికి డ్రోన్లు మంజూరు





వ్యవసాయ డ్రోన్ ఎగరవేసే ముందు ప్రధానమంత్రితో అరసవిల్లి గాయత్రి మాటామంతీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మన ఆడపడుచుకు దేశ రాజధానిలో అపురూప గౌరవం దక్కింది. మట్టిని నమ్ముకుని బతుకుతున్న మహిళా రైతుకు ప్రధాని ముందు డ్రోన్ ఎగురవేసే అపూర్వ అవకాశం వచ్చింది. ఢిల్లీలో సోమవారం జరిగిన నమో డ్రోన్ దీదీ కార్యక్రమంలో పోలాకి మండలం సుసరాం గ్రామానికి చెందిన అరసవల్లి గాయత్రి అనే మహిళా రైతు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలు కార్యరూపం దాల్చడంతో ఈ మొదటి అడుగు పడింది. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టిసారించింది. శిక్షణ పొందిన మహిళలతో వ్యవసాయ సాగుకు డ్రోన్ల వినియోగం తీసుకురావాలని ఆలోచన చేసింది. దానిలో భాగంగా శిక్షణ పొందిన మహిళలకు నమో డ్రోన్ దీదీలో భాగంగా డ్రోన్లు కూడా మంజూరయ్యాయి.



వ్యవసాయ సాగులో వినియోగించేందుకు మంజూరైన డ్రోన్లు

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

వ్యవసాయ సాగులో డ్రోన్లను వినియోగించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే సబ్సిడీతో డ్రోన్లు మంజూరు చేసేందుకు ముందుకు వచ్చింది. అందులో భాగంగానే మహిళలకు ప్రత్యేక తర్ఫీదు నిచ్చి, వారి చేత వ్యవసాయ సాగులో డ్రోన్లు వినియోగంలోకి తెచ్చి దిగుబడులు పెంచడమే కాకుండా సాగు ఖర్చులను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ క్రమంలో ఆసక్తి చూపుతున్న వివిధ స్వచ్ఛంద సంస్థల సాయంతో మహిళలకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చే విధంగా ప్రోత్సహిస్తోంది. దానిలో భాగంగా మన జిల్లాలో అగ్రి బిజినెస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. అందులో శిక్షణ పొందిన 10మంది మహిళలకు నమో డ్రోన్ దీదీ స్కీమ్‌లో డ్రోన్లు మంజూరయ్యాయి.

ఎంతో మేలు..

- వ్యవసాయ డ్రోన్లతో రైతులకు మేలు జరగనుంది.
- తక్కువ ఖర్చుతో, తక్కువ మందుతో, తక్కువ సమయంలో గ్రామం మొత్తం పిచికారి చేయడానికి డ్రోన్లు దోహదపడతాయి.
- పంట దిగుబడులు పెరగడమే కాకుండా దిగుబడి నాణ్యత పెరిగి మంచి ధర లభిస్తుంది.
- డ్రోన్ల టెక్నాలజీ వల్ల కాలుష్యం బాగా తగ్గుతుంది.
- రోజురోజుకీ వ్యవసాయానికి దూరమవుతున్న రైతన్నను వ్యవసాయ రంగంలోకి వచ్చేలా ప్రోత్సహించేలా ఉంటుంది.

గుంటూరులో మరో 9మంది..

డ్రోన్లు మంజూరైన వారిలో పోలాకి మండలం సుసరాం గ్రామానికి చెందిన అరసవిల్లి గాయత్రి సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమానికి హాజరై, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందు డ్రోన్ ఎగురవేశారు. ఆ అనుభవాలను కూడా ఆమె ప్రధానితో పంచుకున్నారు. మిగతా 9మంది గుంటూరులో జరిగిన వర్చువల్ ప్రోగ్రామ్‌లో పాల్గొని తమకు మంజూరైన డ్రోన్లు ఎగురవేశారు. మన రైతు మహిళ గాయత్రి నేరుగా ప్రధానితో మాట్లాడడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.



గుంటూరులో వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో మంజూరు పత్రాలు అందుకుంటున్న మహిళా రైతులు

22 నుంచి శ్రీకూర్మనాథుని డోలోత్సవాలు



గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథాలయంలో విశేష ఉత్సమైన డోలోత్సవం ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించనున్నామని ఈఓ జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు అన్నారు. సోమవారం ఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 22న శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి కామదహన మంటపం వద్ద మఖ ఉత్సవం, 23, 24వ తేదీలో సమీప శ్రీకూర్మం- మత్స్యలేశం వద్ద సముద్ర స్నానాలు (పడియ), 25వ తేదీ పౌర్ణమి పురస్కరించుకొని డోలోమంటపంలో ఉత్తరాభిముఖ దర్శనంతో పాటు బుక్కా బర్గుండ పూజ జరుగుతాయన్నారు. భక్తులు హాజరై స్వామిని దర్శించుకోవాలని కోరారు.

మరో నలుగురు ఇంటర్ విద్యార్థులు డీబార్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు అత్యంత పకడ్బందీగా కొనసాగుతున్నాయి. పరీక్షల్లో 8వ రోజు సోమవారం మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన నలుగురు సెకెండియర్ విద్యార్థులు పట్టుబడగా వీరిని అధికారులు డీబార్ చేశారు. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు, టెక్కలి విశ్వజ్యోతి జూనియర్ కళాశాలలో ఒకరు, టెక్కలి బీఎస్ అండ్ జేఆర్ జూనియర్ కళాశాలలో ఇద్దరు పట్టుబడ్డారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు మాల్‌ప్రాక్టీసు కింద డీబారైన విద్యార్థుల సంఖ్య పదికి చేరుకుంది. 8వ రోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 878 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 18037 మందికి 828 మంది, ఒకేషనల్ విభాగంలో 1208 మందికి 50 మంది గైర్హాజరయ్యారు.

మహిళా ద్రోహి చంద్రబాబును నమ్మొద్దు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. సభకు హాజరైన మహిళలు

- వైఎస్సార్ చేయూత పంపిణీలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అధికారంలో ఉన్నంత కాలం చంద్రబాబు మహిళలకు అనేక హామీలిచ్చి మోసగించారని అందుకే మహిళలెవ్వరూ నమ్మవద్దని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పీఎస్ఎన్ ఎంహెచ్ స్కూల్ గ్రౌండ్స్‌లో చేయూత సంబరాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, తమ ప్రభుత్వం నాడు ఇచ్చిన ప్రతి మాటనూ నిలబెట్టుకుందన్నారు. ఐదేళ్లలో ఎలాంటి అవినీతి లేకుండా నేరుగా సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందజేశామన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సదుద్దేశంతో అన్ని పథకాలనూ ఇల్లాలి పేరు మీదనే ఇస్తున్నామన్నారు. 45 ఏళ్ల వయసులో.. స్త్రీకి తండ్రిలా ప్రతి ఏడాది ప్రభుత్వం అందించే పథకమే వైఎస్సార్ చేయూత అని అన్నారు. కొడుకు మాదిరి ఆదరించే ఈ పథకం కింద రూ. 18,500 ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.40 కోట్లు అందజేశామన్నారు. విపక్ష నేత చంద్రబాబుకు అనుభవం ఉందని 2014లో అధికారమిస్తే మహిళా సంఘాలను మోసం చేశారని గుర్తు చేశారు. మళ్లీ మోసం చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారని, జనం గ్రహించాలని కోరారు. చాంతాడంత హామీలిచ్చి మోసం చేసిన చంద్రబాబుకి అధికారం ఇస్తారా ? లేదా మాట మీద నిలబడే జగన్‌కి అధికారం ఇస్తారా ? అన్నది మీరే ఆలోచించుకోవాలని కోరారు. పాలనలో వచ్చిన మార్పులను గమనించి వైఎస్సార్‌సీపీకి అధికారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా, యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ పద్మావతి, పార్టీ ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, కోణార్క్ శ్రీను, పైడి మహేశ్వర రావు, సాధు వైకుంఠరావు, ఎంఏ రఫీ, సుంకరి కృష్ణ, పి.సుగుణారెడ్డి, బొడ్డేపల్లి పద్మజ, చల్ల అలివేలుమంగ, మండవల్లి రవి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రెక్టార్, రిజిస్ట్రార్ నియామకాలు



రిజిస్ట్రార్‌గా పీలా సుజాతకు, రెక్టార్‌గా బిడ్డిక అడ్డయ్యకు నియామక పత్రం అందజేస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రెక్టార్‌గా ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ పీలా సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని నియామక పత్రాలను సోమవారం అందజేశారు. డిసెంబర్ 30 నుంచి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా అడ్డయ్య కొనసాగుతున్నారు. ప్రస్తుతం రెక్టార్‌గా బాధ్యతలు స్వీకరించారు. బయోటెక్నాలజీ ప్రొఫెసర్ సుజాత సీడీసీ డీన్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. రెక్టార్ అడ్డయ్య 1994లో ఎకనామిక్స్ రీసెర్చ్ అసిస్టెంట్‌గా ఏయూ పీజీ సెంటర్‌గా ఉన్న ఎచ్చెర్ల పీజీ కేంద్రంలో తన సర్వీస్ ప్రారంభించారు. వర్సిటీ ఏర్పడ్డాక ఇక్కడ ఆప్షన్ ఇచ్చుకున్నారు. రిజిస్ట్రార్ సుజాత 2010లో బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలు కీలక బాధ్యతలు నిర్వహించారు.

సీబీఎస్‌ఈ పరీక్ష కేంద్రం పరిశీలన



రాజపురం మోడల్ స్కూల్‌లో తనిఖీ చేస్తున్న సమగ్రశిక్షా ఏఎంఓ లక్ష్మీనారాయణ

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశపెట్టిన సీబీఎస్‌ఈ సిలబస్‌కు సంబంధించి బోర్డు పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం సమగ్రశిక్షా పథకం ఏఎంఓ జి.లక్ష్మీనారాయణ, జీసీడీఓ కె.నీరజ రాజపురం పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం ఏపీ మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది సీబీఎస్‌ఈ సిలబస్‌లో విద్యాబోధన నిర్వహించింది. ఈ నేపథ్యంలో 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో సీబీఎస్‌ఈ సిలబస్‌తో నిర్దేశించిన ప్రశ్న పత్రాన్ని ఇచ్చారు. తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలబాలికలు వచ్చే ఏడాది టెన్త్‌ను సీబీఎస్‌ఈ విధానంలో రాస్తారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సులు, బుక్‌బ్యాంక్‌ల నిర్వహణ తీరుపై జీసీడీఓ కే నీరజ తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు.



చీమలవలసలో గ్రామీణ పశువైద్యశాలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

చీమలవలసలో గ్రామీణ పశువైద్యశాల, నెల్లిపర్తిలో తాగునీటి కుళాయిలు, కొరపాంలో సచివాలయాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ప్రారంభించారు. పశువైద్య శాలకు రూ. 26.50 లక్షలు, తాగునీటి కుళాయిలకు రూ.41 లక్షలు, సచివాలయానికి రూ.40 లక్షలు ఖర్చు చేశారు. – ఆమదాలవలస



అక్కుపల్లిలో పీహెచ్‌సీ ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు

మండలంలోని అక్కుపల్లిలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం ప్రారంభించారు. రూ.1.85 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. వజ్రపుకొత్తూరు రూరల్:



బెల్లుపడ వద్ద యూపీహెచ్‌సీ ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, పిరియా విజయ

మున్సిపాలిటీలోని బెల్లుపడ, పురుషోత్తపురంలో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ప్రారంభించారు. వీటి నిర్మాణానికి దాదాపు రూ.2కోట్లు పైచిలుకు ఖర్చయ్యింది. – ఇచ్ఛాపురం

క్లుప్తంగా

లారీ బోల్తా..



కొమ్మువలస గ్రామ జేజే రోడ్డుపైన బోల్తా పడిన చెరుకు లారీ

బూర్జ: మండలంలో గల కొమ్మువలస గ్రామ మలుపు ప్రధాన రహదారి సరుబుజ్జిలి–మదనాపురం రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చెరుకు లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. జలుమూరు మండలం అల్లాడ గ్రామం నుంచి రేగిడి మండలం సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు లోడుతో వెలుతున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనం తప్పించబోయి బోల్తా పడింది. అయితే ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

‘ప్రధాన మంత్రి సురాజ్’ రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి సురాజ్ కార్యక్రమం ఈనెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్టు ఎస్సీ, కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతులు, సఫాయి కార్మికులు, నమస్తే పథకం లబ్ధిదారులతో ప్రధాన మంత్రి వర్చువల్ విధానంలో మాట్లాడతారని ఆమె పేర్కొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన





ఎన్నికల అధికారులు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల విధులపై పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ అధికారులకు సూచించారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల బాధ్యతల్లో ఉన్న వారంతా విధుల పట్ల అంకితభావంతో ఉండాలని సూచించారు. ఎన్నికల్లో వినియోగించే మానవ శక్తి ప్రణాళిక, వారికి తగిన శిక్షణ నిర్వహణ, ఎన్నికలకు వినియోగించే పరికరాల నిర్వహణ, అలాగే రవాణా వ్యవస్థల పర్యవేక్షణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)కి సంబంధించి ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని చెప్పారు. అభ్యర్థుల ఖర్చుకు సంబంధించి వ్యయ పర్యవేక్షణలో సమన్వయంతో పనిచేయాలని, పార్లమెంట్ అభ్యర్థులు రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థులు రూ.40 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేసేందుకు ఎన్నికల కమిషన్ నిర్ణయించిందని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల విధుల్లో ఉన్న వారంతా కచ్చితంగా, సులభంగా, సౌకర్యవంతంగా ఓటు వేసేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్‌ను ఎన్నికల విధుల్లో పాల్గొనే డ్రైవర్లకు సైతం అందుబాటులో ఉంచుతామన్నారు. బుధవారం నాటికి ఎన్నికల విధులకు గుర్తించిన వారంతా తమ ఓటు గుర్తింపు కార్డు ప్రతిని సంబంధిత నోడల్ అధికారికి తెలియజేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో గుర్తించిన ఇబ్బందులు ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని, ఎన్నికల విధులతో సంబంధం లేని వ్యక్తులతో ఈ అంశాలపై చర్చించరాదని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియపై అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సూచనలు పాటించాలని, మద్యం, డబ్బు, ఇతర ప్రలోభాల పంపిణీ నియంత్రణకు నిఘా బృందాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, నోడల్ అధికారులు, ఆర్వోలు, ఈఆర్వోలు, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు హాజరయ్యారు.

డీసీసీబీ ద్వారా ఎడ్యుకేషన్ రుణాలు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు

కొత్తూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా రైతుల పిల్లలకు రూ.25 లక్షలు వరకు ఎడ్యుకేషన్ రుణాలు మంజూరు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం కొత్తూరు పీఏసీఎస్‌ను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. పీఏసీఎస్, డీసీసీబీల ద్వారా తీసుకున్న వ్యవసాయ రుణాలు మార్చి నెలాఖరులోగా రెన్యువల్ చేసుకుంటే కేవలం 7 శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుందన్నారు. మార్చి దాటితే 13 శాతం వడ్డీ పడుతుందని వివరించారు. జిల్లాలో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ జరుగుతోందన్నారు. కమర్షియల్ ప్రాతిపదికన ఎకరం భూమిపై రూ.5లక్షలు వరకు 12.75 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని బ్రాంచిల్లో లాకర్ సదుపాయాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఏడో తరగతి చదువుకున్న వ్యక్తులకు కుటీర పరిశ్రమల కింద 35 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నట్లు చైర్మన్ వివరించారు. చిరు వ్యాపారులకు రోజువారీ కలెక్షన్ కింద 100 రోజులు చెల్లించేందుకు గాను రూ. 50 వేలు అందజేస్తామని తెలిపారు. 100 రోజులకు గాను కేవలం రూ.1500 వడ్డీ తీసుకుంటారని చెప్పారు. డీసీసీబీ ద్వారా రైతులకు పలు విధాలుగా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ రైతులకు కోరారు.

సమావేశంలో కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎల్ఎన్‌పేట చైర్మన్ కృష్ణారావు, సీఈఓ రవిరాజు, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు, విష్ణు, పార్టీ నేతలు మొజ్జాడ చక్రపాణి, బోరసింహాద్రి నాయుడు, వైకుంతరావు, గండివలస ఆనందరావులతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌గా జెడ్పీ చైర్‌పర్సన్



ట్రాక్టర్ నడుపుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా విజయ అందరితో కలివిడిగా కలిసిపోతున్నారు. సోమవారం సోంపేట పట్టణంలో ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న పోలమాంబ ట్రాక్టర్ల అసోసియేషన్ నూతన భవన నిర్మాణం భూమి పూజలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్‌తో పాల్గొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొని డ్రైవింగ్ చేసి ఔరా అనిపించారు. – సోంపేట

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సబ్బి గణపతి (48) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సబ్బి గణపతికి టెక్కలి మండలం రామదాసుపేట గ్రామానికి చెందిన సరస్వతితో కొన్నేళ్ల కిందట వివాహమైంది. కానీ వీరిద్దరూ ఆరేళ్లుగా విడిగా ఉంటున్నారు. సరస్వతి ఆమె కన్నవారింటిలో ఉండగా గణపతి లక్ష్మీపురంలో ఉంటున్నారు. ఈ నెల 8న ఇంటిలో ఉన్న పురుగు మందు తాగేయగా కుటుంబ సభ్యులు గుర్తించి తొలుత బుడితి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. దీనిపై గణపతి భార్య సరస్వతి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రమణమూర్తి కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కేజీబీవీ.. పిలుస్తోంది రావోయి

- కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 11 వరకు అవకాశం
- 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ



సోంపేట మండలం రాజాంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ)ల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను కేజీబీవీల్లో 6వ తరగతిలో, అలాగే ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఈనెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏప్రిల్ 11 ఆఖరు తేదీ.

26 కేజీబీవీలు.. 2080 సీట్లు

పునర్విభజన అనంతరం 30 మండలాల శ్రీకాకుళం జిల్లాలో 26 కేజీబీలు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలోనే బోధన సాగే ఈ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కొక్క పాఠశాలలో 40 సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన 1040 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. అలాగే ఒక్కో కేజీబీవీకి ఒక ఇంటర్మీడియెట్ కోర్సును కేటాయించడంతో కేజీబీవీకి 40 చొప్పున మొత్తం 1040 ఇంటర్ సీట్లను భర్తీ చేస్తారు. ఈ లెక్కన, ఆరో తరగతి, ఇంటర్‌లో కలిపి మొత్తం 2080 సీట్లను నింపనున్నారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను సైతం భర్తీ చేస్తారు. పేద, అనాథ పిల్లలతో పాటు బడిబయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసినవారు), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) జీవిస్తున్న బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. 6వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన బాలికలై ఉండాలి. అలాగే ఇంటర్‌లో ప్రవేశాలకు టెన్త్‌క్లాస్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. హెచ్‌టీటీపీ:ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్// వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పూర్తిచేయాల్సి ఉంటుంది.

ప్రత్యేక బోధన

- కేజీబీవీల్లోకి పురుషులకు ప్రవేశం పూర్తిగా నిషేధం. ఉపాధ్యాయులు (టీజీటీ/ పీజీటీలు) సైతం మహిళలే.
- అలాగే ప్రహరీ, గేటు, వాచ్‌మ్యాన్‌లతో కూడిన రక్షణ, భద్రత ఉంటుంది.
- అత్యుత్తమ బోధన, నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలతో కేజీబీవీల్లో సీట్లకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది.
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కేజీబీవీలపై సమగ్రశిక్ష అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు.
- మనబడి నాడు–నేడు ద్వారా కేజీబీవీలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఐఎఫ్‌జీ ప్యానెల్స్ ద్వారా డిజిటల్ తరగతులను మరింత చేరువ చేశారు.
- సైన్స్‌ప్రాజెక్టులు, యోగా, క్రీడలు, ఆటపాటలు నిర్విరామంగా ఉంటాయి. నీట్, జేఈఈ, ఏపీ ఈఏపీసెట్ వంటి వివిధ పోటీపరీక్షలకు కూడా సన్నద్ధం చేస్తున్నారు.
- అలాగే ప్రభుత్వం అమ్మఒడి, జగనన్న విద్యాకానుక వంటి పథకాలు వర్తింపజేస్తోంది.

హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు..

కేజీబీవీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమయంలో ఏర్పడిన సందేహాలు, సమస్యల నివృత్తి కోసం ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్ 18004258599ను ఏర్పాటు చేసింది. అలాగే జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు సందేహాల కోసం సమగ్రశిక్ష జీసీడీఓ ఎస్.నీరజ(సెల్: 9440112221)ను సంప్రదించవచ్చని ఏపీసీ జయప్రకాష్ చెబుతున్నారు.

మళ్లీ రూట్ మారింది..!

భువనేశ్వర్:



రాష్ట్రంలో మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభం తొలి నుంచి రోజుకో మలుపు తిరుగుతుంది. తొలుత భువనేశ్వర్ నుంచి తదుపరి పూరీ నుంచి విశాఖపట్నం మధ్య ఈ రైలు సేవలు ఉంటాయని ఆదివారం వరకు ప్రకటించారు. తాజాగా సోమవారం సాయంత్రం సరికి 20841/20842 నంబర్ల వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య నడుస్తుందని ప్రకటించారు. సోమవారం మినహా వారానికి 6 రోజులపాటు ఉభయ దిశల్లో రాకపోకలు చేస్తుందని వెల్లడించారు.

హాల్టులు

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య ఖుర్దారోడ్, బలుగాంవ్, బరంపురం, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. దీనిలో 8 అధునాతన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ బోగీలు ఉంటాయి.

20841(అప్)		భువనేశ్వర్–విశాఖపట్నం
రాక	పోక	స్టేషన్
--	05.15	భువనేశ్వర్
05.33	05.35	ఖుర్దారోడ్
06.23	06.25	బలుగాంవ్
07.05	07.07	బరంపురం
07.18	07.20	ఇచ్ఛాపురం
08.18	08.20	పలాస
09.03	09.05	శ్రీకాకుళం రోడ్
09.48	09.50	విజయనగరం
11.00	--	విశాఖపట్నం

20842(డౌన్)		విశాఖపట్నం–భువనేశ్వర్
రాక	పోక	స్టేషన్
--	15.30	విశాఖపట్నం
16.18	16.20	విజయనగరం
17.08	17.10	శ్రీకాకుళం రోడ్
18.10	18.12	పలాస
18.40	18.42	ఇచ్ఛాపురం
19.00	19.02	బరంపురం
19.52	19.54	బలుగాంవ్
20.57	20.59	ఖుర్దారోడ్
21.30	--	భువనేశ్వర్

రైల్వే హాల్టు కోసం జెడ్పీ చైర్ పర్సన్ కృషి

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పరిధిలో గల రైల్వేస్టేషన్లలో హాల్టులు, అండర్ పాసేజ్‌ల ప్రతిపాదన, వివిధ సౌకర్యాల కల్పన తదితర అభివృద్ధి పనుల కోసం జెడ్పీ చైర్‌పర్సన్, నియోజవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా విజయ అవిరళ కృషి చేస్తున్నారు. ఆ ఫలితంగానే తాజాగా విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు వేసిన వందేభారత్ రైలుకు ఇచ్ఛాపురంలో హాల్టు కల్పించడంలోను, మొన్నటికి మొన్న విశాఖ–పలాస ప్యాసింజర్ రైలు బరంపురం వరకు విస్తరించడం వంటి కార్యక్రమాలు సాధించడంలో సఫలీకృతమయ్యారు. విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు వేసిన వందేభారత్ రైలుకు ఇచ్ఛాపురంలో హాల్టు కల్పించడంలో జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ గట్టిగా పట్టుబట్టారు. మొదట ఇచ్ఛాపురంలో హాల్టు కల్పిస్తున్నట్లు ప్రకటించి, తర్వాత రద్దు చేశారు. తాజాగా సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో మళ్లీ హాల్టు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 12న ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను పిరియా విజయ రైల్వే మంత్రిని కలిసి పలు వినతులు అందించారు. మరిన్ని రైళ్లకు హాల్టు కల్పించడంతో పాటు పలు అభివృద్ధి పనులపై కూడా విన్నవించారు.

నిర్మాణ రంగంలో సాంకేతిక విప్లవం

- మెట్రో రైల్స్ ఎండీ యూజేఎం రావ్



మెట్రో రైల్స్ ఎండీను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

టెక్కలి: మారుతున్న కాలంతో పాటు నిర్మాణ రంగంలో సాంకేతిక విప్లవాలు చోటు చేసుకుంటున్నాయని రాష్ట్ర మెట్రో రైల్స్ ఎండీ యూజేఎం రావ్ వెల్లడించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విభాగం ఆధ్వర్యంలో ‘సస్టైనబుల్ అండ్ రెసిలియంట్ సివిల్ ఇంజినీరింగ్ ప్రాక్టీస్’ అనే అంశంపై ఈ నెల 16 వరకు జరగనున్న అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరవేగంగా మారుతున్న సాంకేతిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అధ్యాపకులు ఎప్పటికప్పుడు వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్మాణ రంగంలో సాంకేతిక విప్లవం వల్ల భూగర్భంలో, అంతరిక్షంలో, సముద్రాల్లో నిర్మాణాలు చేయగలిగే పరిజ్ఞానం సాధిస్తున్నారని అన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్లు కె.శ్రీనివాసరావు, ఎస్.బాలప్రసాద్, కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.విజయ్‌కుమార్, అధ్యాపకులు ఆజాద్, పి.దినకర్, సౌజన్యవాణి, రామ్మోహన్, ఆర్.నాయుడు పాల్గొన్నారు.